# శ్రీసన్నిధానం

సంపుటి 2 సంచిక 01

జనవరి 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. పుష్య మాస శోభ
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
   భక్తి భావ ప్రీతి-దివ్య ప్రబంధఖ్యాతి
7. వివాహనిశ్చయం-సంప్రదాయం
8. ఆధ్యాత్మికత అంటే-
9. శ్రీపతిస్తుతి
10. శ్రీవైష్ణవ కళ్యాణ వేదిక
11. శ్రీసన్నిధానంకు మంగళాశాసనాలు
12. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

అమ్మ అనుగ్రహిస్తేనే కోరికలు తీరుతాయి. తిరు అంటే శ్రీ, శ్రీ అంటే లక్ష్మి, సంపద. అసలైన సంపద ఏమిటీ అంటే తడుముకోకుండా 'మోక్షం' అని శ్రీవైష్ణవుడైనవాడు చెబుతాడు. మోక్ష సాధనకోసం అమ్మ ఆచరించిన వ్రతం చేయాలి. లేదా ముక్కోటి ఏకాదశి నాడు శ్రీవిల్లిపుత్తూరులోని అమ్మ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేయాలి. శ్రీవిల్లిపుత్తూరులోని ఉత్తర ద్వార దర్శనానికి అంత ప్రాధాన్యం ఉంది. అత్యంత ప్రాధాన్యతగల ఆలయానికి ప్రధాన రాజగోపురం 192 అడుగుల ఎత్తు ఉంటుంది. 108 దివ్యదేశాలలో ఆండాళ్ జన్మించిన స్థలం శ్రీవిల్లి పుత్తూరు. పన్నెండు అంతస్థుల శ్రీవిల్లిపుత్తూరు గోపురం పెరియాళ్వార్ నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇది తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం కూడా. ఈ ఆలయాల సముదాయంలో ప్రధాన ఆలయం వటపత్రశాయి ఆలయం. ఆండాళ్ తల్లి, పెరియాళ్వార్ ఆరాధించినది వటపత్రశాయినే. కానీ అమ్మకే అధిక ప్రాధాన్యం. అమ్మ అనుగ్రహం కోసం అమ్మ ఆచరించిన వ్రతం "శ్రీ" కోసం ఆచరించబడిన వ్రతం. పావై అంటే పాటలతో కూర్చిన మాల. శ్రీని పొందడంకోసం మాలకూర్చి పాటలు పాడింది. ఇది సంకల్పవ్రతం, భక్తి యజ్ఞం. పాటల మాల తిరుప్పావై వేదోపనిషత్తుల సారమైన భగవత్ తత్వాన్ని ఆవిష్కరిస్తుంది.


PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 040 35756519; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## సంప్రదాయ అక్షరసిరి 'శ్రీసన్నిధానం'

కాలంతో పాటు మనం పరుగెడుతున్నాం. కానీ కాలగర్భంలో నేడు, నిన్నగా మారి జరిగిన ఈ క్షణాలు తిరిగి రావడంలేదు. కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఒక మంచి మాట, ఒక మంచి భావం మనసంస్కృతి సంప్రదాయ వెలుగులు విరజిమ్మడానికి ప్రతి ఇంటికి, ప్రతి మొబైల్‌లోకి డిజిటల్ సంచికగా శ్రీసన్నిధానం అక్షరయజ్ఞాన్ని ప్రారంభించింది. మంచిని తెలుసుకుందాం, నలుగురికి మంచిని పంచుదామన్న శ్రీసన్నిధానం ట్రస్ట్ లక్ష్య సాధన దిశగా అడుగులో అడుగు వేస్తూ వెనుతిరిగి చూడకుండా ముందుకు వెళుతోంది. డిజిటల్ రూపంలో పత్రికకు ఒక రూపునిచ్చి పాఠకులకు చేరువయ్యాం. ఇలా సంవత్సరం గడిచిపోయింది. ఈ అక్షర యజ్ఞంలో ఎందరో భాగవతోత్తములు తమ కలంనుంచి జాలువారిన అమృత ధారతో సమాజ చైతన్యానికి వెలుగు మార్గం చూపుతున్నారు. సంవత్సరంలోనే పాఠకుల నాడిని పట్టుకుని శ్రీసన్నిధానం లక్ష్యంవైపు నడుచుకుంటూ వెళుతోంది. తొలుత పక్షపత్రిగా అందించాలనుకున్నా లక్ష్యం నెరవేర్చడానికి పట్టుదలతో మాస పత్రికను కొనసాగిస్తున్నాము. కాలంతో పరిగెడుతుంటే ఆలోచనలకు అందనంత వేగం!. ఇక్కడ వేగం విషయానికి వస్తే కాంతి వేగానికి మించి వేగం ఆలోచనదే అని చెప్పకతప్పదు.

మంచి ఆలోచనతో భరతజాతిని జాగృతం చేసే సంగతులను మళ్ళీ మళ్లీ చెప్పుకుందాం. సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే దిశగా అడుగులు వేశాం. సమతామూర్తి ఆవిష్కరణ అద్భుతసంఘటనకు అక్షరరూపం ఇచ్చాము. శ్రీరామానుజ మార్గాన్ని జనం గుండెచప్పుడుగా చేయడానికి శ్రీరామానుజ సుధామాధురిగా భగవత్‌రామానుజుల వారి జీవనగమనంలోని ఎన్నో సంఘటనలను పాఠకుల ముందు ఉంచాం. ప్రతి అక్షరం సమ సమాజ స్థాపనకు చైతన్య శంఖం పూరించేలా సందేశాలు అందిస్తున్నాం. కాలగమనంలో మైలురాళ్లుగా ఎన్నో కొత్త సంగతులు. అన్నీ పాఠకుల ముందు ఉంచుతున్నాం. పాఠకుల ఆదరణ మరువలేనిది, మరిచిపోనిది. పాఠకులు నిత్యం శ్రీసన్నిధానాన్ని ఆదరిస్తూనే ఉన్నారు. కొత్తదనాన్ని ఆస్వాదిస్తూనే ఉన్నారు. డిజిటల్ సంచిక అందుకుంటూనే ముద్రణప్రతికి ఆసక్తి చూపారు. ఆదరణ కనపరుస్తున్నారు. పాఠకదేవుళ్ల మనోభీష్టాన్ని శ్రీసన్నిధానం కాదనడంలేదు. శ్రీసన్నిధానం ఎంచుకున్న ఈ మార్గం సుగమమైనదేమీ కాదు. అలాగని కష్టమని చెప్పలేం. ఇష్టంగా చేస్తున్నపని పదిమందికి మేలు చేకూర్చాలని, అందరిని జాగృతపరుచాలన్నదే లక్ష్యం. సంవత్సర కాలంలో 13 సంచికలు. అన్నీ ఆణిముత్యాలే!! అక్షర సత్యాలే!! నిజానికి నిలువెత్తు నిదర్శనాలు. పాఠకులకు కావలిన సంగతుల సమాహారాన్ని అందిస్తూనే, ఇష్టమైన కొత్తశీర్షికను అందించేయత్నం శ్రీసన్నిధానం సంపాదకమండలి చేస్తోంది. సంచికను చూసినవారు ఈ సంచికను మరొకరిని చదవమని ప్రోత్సహించడమే శ్రీసన్నిధానంనకు మీరు ఇస్తున్న ఆదరణ, ఆభిమానంగా భావిస్తాం. ఆధ్యాత్మిక భావజాలంతో వెలువడుతున్న సంచికలలో భక్తి, అనురక్తి, సత్ప్రవర్తన, సదాచారం, ధర్మాచరణం, జాతీయ స్ఫూర్తి ఇమిడి ఉన్నాయని మరువకండి. లాభాపేక్షలేకుండా నలుగురికి మేలుచేయాలన్న శ్రీసన్నిధానం లక్ష్యానికి మీరూ చేయూత నివ్వండి. నలుగురికి మంచిని పంచుదాం. శ్రీపతిస్తుతితో మంచిని తెలుసుకుందాం, రండి!! శ్రీసన్నిధానంతో మీరూ నడవండి!! శ్రీసన్నిధానం పత్రిక మొదటి సంవత్సరం పూర్తి చేసుకొన్న సందర్భంగా పాఠకులందరికి శుభాకాంక్షలు

– చీఫ్ ఎడిటర్

# సంక్రాంతి సంబరాల పుష్యమాస శోభ



ప్రపంచీకరణలో హేతుబద్ధమైన ఆలోచనా ధోరణి పెరిగి విశ్వాసాల ఆధారంగా ఆచరించే సంప్రదాయాలు సన్నగిల్లి పోయాయి. అన్య సంస్కృతుల ప్రభావం చేత మరికొన్ని ఆచరణలు అడుగంటి పోయాయి. కొత్తదనానికి అలవాటు పడి మరికొన్ని పర్వదిన విధి విధానాలకు దూరమయ్యాము. అది కొంత విచారకరమే అయినా అందం, ఆహ్లాదం, ఆనందం, సఖ్యత, సాఫల్యం పెంచే సంస్కృతులు శాశ్వతంగా నిలిచే ఉంటాయి. అలాంటి గొప్ప పండుగ సంక్రాంతి. పుష్య మాసం సంక్రాంతి నోములతో, ముంగిట ముగ్గులతో, ధాన్యపురాశులలతో, భోగిమంటలలతో, పాడి పశువుల పూజలతో సాగుతుంది. సూర్యోదయం ఆలస్యంగా సూర్యా స్తమయం త్వరగా జరిగే హేమంత ఋతువు చివరి మాసం పుష్యమాసం. నీరెండలో విరిసే పువ్వులు కూరగాయ లతో, కొత్త ధాన్యంతో సమృద్ధి గలిగిన మాసం. పౌష్యం అంటేనే పోషించునది అని అర్థం. ఉత్తరాయణ దక్షిణాయణాలు సగం సగంగా ఈ మాసంలో ఉంటాయి. సూర్యమానం ప్రకారం ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్షమందలి ఏకాదశి ముక్కోటి ఏకాదశి. ఈ ఏకాదశి మార్గశిర పుష్య మాసాల్లో వస్తుంది. సాధారణంగా ధను సంక్రమణం తర్వాత శుక్ల ఏకాదశి పుష్య మాసంలోనే వస్తుంది. పుష్య మాసంలో నూతన ఆంగ్ల సంవత్సరాది వస్తుంది. జీవన వ్యవహారాల్లో ఆంగ్ల తేదీల విధానాన్ని ఉపయోగిస్తాము కాబట్టి సంవత్సరం ప్రారంభ దినంగా దేవాలయ దర్శనాలు విశేష ఆరాధనలు ఆచారంగా చేస్తున్నాము. వైకుంఠ ఏకాదశి దేవాలయాల్లో గొప్ప ఉత్సవాన్ని జరుపుతారు. ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా తిరుపతిలో సంవత్సరానికి ఒకసారి మాత్రమే వైకుంఠ ద్వారం నుండి దర్శనాలను ఏర్పాటు చేస్తారు. తిరుపతి శ్రీరంగం వంటి ప్రసిద్ధ క్షేత్రాల్లో అత్యంత వైభవంగా ఉత్తర ద్వార దర్శనం జరుగుతుంది, భద్రాచలం యాదగిరిగుట్ట ధర్మపురి మొదలగు పుణ్యక్షేత్రాల్లో, అనేక దేవాలయాల్లో ఈ ఉత్సవానికి వేల మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. భోగి రోజున తిరుప్పావై వ్రత సమాపనంగా గోదా కళ్యాణాలు జరిపిస్తారు. పుష్య మాసం ఆదివారాలు అత్యంత విశేషమైనవి. దీనికి ఎన్నో వ్రత కథలు ప్రచారంలో ఉన్నాయి. పుష్యాదివారాలు సూర్య పూజ నదీ స్నానం శ్రేష్ఠం. ఆదివారం పుష్య మాసం పుష్యమి నక్షత్రం వస్తే రవి యోగం, పుష్యార్క యోగం అని మరింత విశేషమైనది. అయ్యప్ప దీక్షలు, తిరుప్పావై వ్రతం ఈ విధంగా దేవాలయాలు భక్తులతో శోభిస్తాయి.


పుష్యమాస పర్వదినాలను పెద్దల మాటగా తెలుసుకుందాము. పుష్య మాస విదియ ఆరోగ్య ద్వితీయా వ్రతం. పంచమి మధుసూదన పూజ, నాగపూజ. షష్టి కుమార షష్టి. సుబ్రహ్మణ్య పూజ. సప్తమి సూర్య వ్రతం. భద్రాష్టమి, నవమి ధ్వజ నవమి వ్రతం మహామాయను పూజిస్తారు. దశమి శాంభరీ దశమి ద్వార పూజ, గడప పూజలు చేస్తారు. శుద్ధ ఏకాదశి పుత్రదైకాదశి. ధనుర్మాస శుక్ల ఏకాదశి కనుక ఉత్తర ద్వార దర్శనం ముక్కోటి ఏకాదశి జరుపుతారు. శుద్ధ ద్వాదశి, కూర్మ ద్వాదశి, పుష్య పూర్ణిమ చాలా విశేషమైనది. పుష్యమి శనైశ్చరుని జన్మ నక్షత్రం కనుక ఈ మాసం శని పూజలు శనిగ్రహ ధాన్యం నువ్వులు దాన తర్పణాలు చేయడం ఆచారం. శీతల వాతావరణం కనుక పిండి వంటల్లోను నువ్వులు బెల్లం అధికంగా వాడతారు. సూర్యుడు ధనుస్సు నుండి మకరానికి సంక్రమించగానే దక్షిణాయనం ముగిసి ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. సాధారణంగా తిథులతో సంబంధం లేకుండా ఈ సంక్రమణం అనగా సంక్రాంతి పండుగ వస్తుంది.

పుష్య పూర్ణిమకు మరొక విశేషం కూడా ఉంది వేదాధ్యయనంలో శ్రావణ పూర్ణిమనాడు అధ్యాయోపకర్మ చేసి, ప్రారంభించిన వేదాధ్యయనం ఆరుమాసములు చేసి పుష్య పూర్ణిమకు అధ్యాయోత్సర్జన గావిస్తారు. ఉత్సర్జన కర్మ వలన వేదాధ్యయనం వీర్యవంతం అవుతుందని పెద్దలు చెబుతారు. ఉత్సర్జనం చ వేదానాం ఉపాకరణ కర్మ చ అకృత్వా వేద జప్యేన ఫలం నాప్నోతి మానవః. ప్రతి మాసంలోనూ చతుర్దశి పూర్ణిమ అమావాస్యలు వేదాధ్యయనంలో అనధ్యయనం పాటిస్తారు. పుష్య పూర్ణిమను పౌషీఅని మహాపౌషీ అని పిలుస్తారు. అనేక ప్రాంతాలలో వారి స్థల పురాణాలను అనుసరించి “తైపూసమ్” అని ఆయా దేవతలను పూజిస్తారు. **(మిగతా 10 వ పేజీలో)**

# భక్త జన మనో వాంఛలు తీర్చే జానకంపేట స్వామి

## మన దేవాలయాలు

గ్రహదోష నివారణ, మనోవాంఛ సిద్ధి కలిగించే జానకంపేట ఆలయం. శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలు తెలుగు రాష్ట్రాలలో శతాబ్దాల కాలం నుండి కొలువై ఉండి భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్నాయి. ఆ విధంగా భక్తుల పాపాలను హరింప చేసి గ్రహదోషాలను తొలగించి స్వస్థత చేకూర్చే జానకంపేట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం.



ఈ ఆలయాన్ని సుమారు 400 సంవత్సరాల క్రితం రాష్ట్రకూటల కాలంలో గుర్తించి నిర్మించబడినట్లు తెలుస్తోంది. తర్వాత కాలంలో పశ్చిమ చాళుక్యులు, కాకతీయుల చేత పునరుద్ధరించబడినదని స్థానిక చరిత్ర వల్ల తెలుస్తుంది. దట్టమైన అడవి ప్రాంతంలో గుట్టపైన స్వామి స్వయంభువుగా వెలిశాడు. రుద్రుడే క్షేత్రపాలకుడిగా ఉన్న ఈ ఆలయంలో శనివారం అమావాస్య రోజులలో స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు గ్రహదోషాలు ముఖ్యంగా శని గ్రహ దోషాలు కుజదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. స్వామి నాభియందు సాలగ్రామం ఉంటుంది. భక్తవరదుడైన ప్రహ్లాదుని రక్షించుటకు శ్రీమన్నారాయణుడు నరసింహానిగా అవతారం ఎత్తి హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం స్వామి ఉగ్రరూపం లోనే సంచరిస్తూ దండకారణ్య ప్రాంతానికి చేరాడు. ఆ ప్రాంతంలోని ఆహ్లాదకర వాతావరణానికి ముగ్ధుడైన స్వామి అక్కడే సేద తీరాడు. అదే దండకారణ్యంలో తపస్సు చేసుకుంటున్న ఋషులు, స్వామి వారి ఉగ్రరూపాన్ని చూచి భీతిల్లగా, అప్పుడు బ్రహ్మను ప్రార్థించి బ్రహ్మ ఉపదేశించగా, గండకీ నదీ తీరం నుండి సలగ్రామ తెచ్చి ప్రతిష్ఠించగా, స్వామి శాంతించి లక్ష్మీదేవి సమేతంగా వెలిశాడని స్థల పురాణం.



శ్రీరంగం కొండమాచార్యులు



అనంతర కాలంలో జైనమత ప్రవక్త ఒకరు ఆలయ నిర్మాణం గావించారట! ఆలయం వెనుకవైపున ఒక గురుకులాన్ని కూడా ఏర్పాటు చేసారు. గురుకులాన్ని అభివృద్ధి చేసిన కాకతీయులు జైనులు నిర్మించిన ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. ఈ గురుకులాన్ని శివాలయంగా మార్పు చేశారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం వివిధ పాలకుల చేత అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అష్టముఖి కోనేరు ఈ క్షేత్ర ప్రత్యేకత. కలియుగారంభంలో ఈ దండకారణ్యంలో ఋషులు తపమాచరించే సమయంలో రాక్షసులు వారికి ఆటంకాలు కలిగించే వారట! రాక్షసులబారి నుండి రక్షించాలని ఋషులు స్వామిని వేడుకోగా స్వామి ఆజ్ఞ మేరకు అష్టదిక్పాలకులు 8 దిక్కుల కాపలాగా ఏర్పడ్డారు. ఋషుల తపస్సు నిర్విఘ్నంగా కొనసాగుటకు మధ్యలో నీటికొలను ఏర్పాటు చేశారు. అలా ఏర్పడిన నీటి కులను కాలక్రమంలో అష్టముఖి కోనేరుగా ప్రసిద్ధి చెందింది. శని త్రయోదశి అమావాస్య రోజులలో ఈ కోనేరులో స్నానం చేసి స్వామిని దర్శించుకున్న వారికి గ్రహదోష విముక్తి కలుగుతుంది. బ్రహ్మదేవుడే స్వయంగా ప్రారంభించిన బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ అష్టమి నుండి మాఘ బహుళ ప్రతిపద వరకు స్వామివారికి నిర్వహిస్తారు. ఈ క్షేత్రం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో గల జానకంపేట గ్రామ పొలిమేరలలో అడవి ప్రాంతంలో ఉంది. అర్చకులు శ్రీరంగం కొండమాచార్యులు. ఈ ఆలయంలో గత ఆరు తరాలుగా శ్రీరంగం వంశీయులైన శ్రీ వైష్ణవులు అర్చకులుగా కొనసాగుతూ నిత్య కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. నాలుగవతరం శ్రీరంగం గోపాలచార్యులు, ఐదవతరం శ్రీరంగం శ్రీకృష్ణమాచార్యులు, ప్రస్తుత ఆరవతరంలో శ్రీరంగం కొండమాచార్యులు అర్చకులుగా ఉన్నారు. ప్రకృతి రమణీయ తతో సుందరమైన పచ్చని పర్వత శ్రేణులతో అలరారుతున్నది ఈ క్షేత్రం. పర్వతాలపై తెల్లని నురగల సేలయేరు, మంజీరా నదిపై నిర్మించిన నిజాం సాగర్ కాలువ చంద్రహారంలా కనిపిస్తూ భక్తులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. పండుగలు ముఖ్యమైన రోజుల్లో వేల సంఖ్యలో భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**-సముద్రాల రామాచారి నిజామాబాద్**

# శ్రీరామానుజ సుధామాధురి

## భక్తి భావ ప్రీతి - దివ్య ప్రబంధ ఖ్యాతి



భగవంతుడు సముద్రాన్ని తరచి అమృతాన్ని దేవతలకు ఇచ్చినట్లు ఆళ్వార్లు వేద వేదాంతాలను తరచి దివ్య ప్రబంధాలను పరమ భాగవతోత్తముల కోసం ప్రసాదించారట! ఆళ్వార్లు దివ్య ప్రబంధాలలో భగవంతున్ని "అముదు" "పీయూష సారాం" అని అమృతంగా కీర్తించారు. ఆళ్వార్లు అంటేనే పరమ భక్తి తత్పరులు. భక్తి ఆత్మోజ్జీవనం కలిగిస్తుంది. ప్రాణ శక్తిని ఉద్దీపింప చేస్తుంది. అటువంటి భక్తి మార్గం భారతీయ సంస్కృతికే మూలకందం. ఆళ్వార్ల జ్ఞాన ప్రకర్షలో నుండి ఉద్భవించిన భక్తి భావ మాధుర్యం అత్యంత శక్తివంతమైనది. ఆ భగవత్సాక్షాత్కార శక్తి వారి దివ్య ప్రబంధ వాఙ్మయంలో అక్షరాల్లో, శబ్దాల్లో అణువణువు నిబిడీకృతమై ఉంటుంది. అది ఎంతటి వారినైనా భగవదభిముఖులను చేసి పరవశింప చేస్తుంది. దధిని చిలికి వెన్న తీసినట్టు భగవత్ తత్వాన్ని చిలికి భక్తి మధురిమను ఆళ్వార్లు వెలికి తీస్తే, వెన్నకాచి నెయ్యిని చేసినట్టు పూర్వాచార్యులు భక్తికి అనుష్ఠానాన్ని చేర్చి శ్రీ సంప్రదాయాన్ని మనకు అందించారు. అటువంటి భక్తి భావ నిధి యందలి ప్రీతితో జగదాచార్యులు భగవద్ రామానుజాచార్యులు దివ్య ద్రావిడ ప్రబంధ ఖ్యాతిని ప్రాచుర్యం చేశారు. సమాజంలోని అట్టడుగు స్థాయిల వరకు ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని చూపించిన పరమ దయాళువులు శ్రీరామానుజాచార్యులు.



ఆచార్యులైన యామున మునుల వద్ద చేసిన మూడు ప్రతిజ్ఞలలో ఒకటిగా దివ్య ప్రబంధాలను ప్రకాశితం చేశారు. అష్టాంగ యోగ సాధనలనీ, జ్ఞానానుష్ఠానాలనీ క్రియాత్మక ఆచరణముల ద్వారా ఆధ్యాత్మిక సాధన సంపత్తిని సమకూర్చుకుంటున్న వేళ భగవంతుడు అందరివాడు అని, అనన్య భక్తికి వశ పడగల భగవత్ సంబంధాన్ని తెలియజేసింది ఆళ్వార్ల మార్గం. వేద మార్గ ప్రతిష్ఠాపనలో శ్రీ భగవద్రామానుజాచార్యులు ఆళ్వారుల దివ్య ప్రబంధములలోని భక్తి మూలాలనే సిద్ధాంతీకరించారని పెద్దలు చెప్తారు. భగవత్ రామానుజాచార్యులు శిష్య పరంపర ద్వారా దివ్య ద్రావిడ ప్రబంధాలకు ఎన్నో వ్యాఖ్యానాలను రచింప చేశారు. సూత్ర సిద్ధాంత గ్రంథాలను తామూ రచించారు. చెక్కుచెదరని పూర్వాచార్యకృత సాంప్రదాయ వాఙ్మయ సంపద శాశ్వతంగా నిలిచి ఉంది. రత్నాల మాలవలె మణిప్రవాళ శైలిలో సంస్కృత పదాలతో కూడిన ఆనాటి ప్రాంతీయ ద్రావిడ భాషలో గల వ్యాఖ్యాన గ్రంథాలన్నీ ఆస్తికులకు విలువైన అమృత నిధులు. అంతటి జ్ఞానులైన భగవద్రామానుజాచార్యులు ఆ దివ్య ప్రబంధ మాధురిలో భగవద్గుణానుభవంలో లీనమయ్యేవారు.

భగవద్ రామానుజాచార్యులు గోదాకృతమైన తిరుప్పావై ప్రబంధంపై అమిత ప్రీతి కలిగి ఉండేవారు. పన్నిద్దరాళ్వార్లలో ఒకరైన గోదాదేవి మొక్కును తాను తీర్చుటకు 100 గంగాళాల పాయసాన్ని భగవంతునికి సమర్పించారట! గోదాగ్రజులని జగదాచార్యుల నామము.


గోపికాతత్వాన్ని తన యందు ఆపాదించుకున్న గోదాదేవి శ్రీకృష్ణునితో ఉన్న నీళాదేవిని "ఉందు మదగళిత్త" అను పాశురంలో తలుపు తెరవమని ప్రార్థిస్తుంది. ఆ పాశురాన్ని అనుసంధిస్తూ యతి రాజులు ఒక ఇంటి ముందు నిలిచి ఉండగా ఆ ఇంటి తలుపు తెరుచుకొని ఒక స్త్రీ బయటకు వచ్చింది. ఆమె చేతి కంకణాల సవ్వడి విని భక్తి పరవశంతో సాష్టాంగ పడ్డారట! ఆ స్త్రీ వణికి పోయి తత్తర పడింది. ఆమె జగదాచార్యుల గురువుగారి పుత్రిక. ఆ పాశురంలో "శీరార్ వళై ఒళిప్ప వందు" అనగా అందమైన కంకణములు ధ్వనించినట్లుగా తలుపు తెరువు అనే భావం ఉంటుంది. ఆ భావ తాదాత్మ్యంలో భక్తి పరవశులైనారు జగదాచార్యులు. ఈ దృశ్యాన్ని చూచి యతిరాజులను వారి ఆచార్యులైన పెరియనంబి గారు పులకిత గాత్రులై "తిరుప్పావై జీయరే" అని పలికారట!. భక్తవశుడు భగవంతుడు అని, "మంత్రాదీనంతు దైవతం" అని పెద్దల మాట! అటువంటి భక్తి పూర్ణమైన మంత్రాలు దివ్య ప్రబంధాలు.

(మిగతా 9 వ పేజీలో)

# వివాహ నిశ్చయం-విశిష్ట సంప్రదాయం



మానవ జీవన పయనం లో ప్రధాన మైలురాయి వివాహం. గృహస్థాశ్రమానికి మనుగడ మలుపు తిరిగే గడియలు మహత్తరమైనవి. ఆ శుభ సంరంభం వివాహ నిశ్చయం. ఆ వివాహ నిశ్చయానికి నాంది వధూవర వరణం! ఏ సాంప్రదాయంలో అయినా వివాహ బంధం జన్మజన్మల అనుబంధంగా భావిస్తారు. "ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాలయాః" అని సూక్తి. వధూవర వరణంలో వారి తల్లిదండ్రులకు ప్రధాన బాధ్యత అయినా ఇందులో సంస్కృతిదీ, సమాజానిదే ప్రధాన భూమికగా ఉంటుంది. వివాహ నిశ్చయంలో అనేక అంశాలు ప్రభావం చూపిస్తాయి. పెద్దల ఆచారాలు, బంధుత్వాలు, సంపన్నత, యోగ్యత, వర్ణ ధర్మాలు మొదలగు వాటి ప్రభావం అధికంగా కనిపిస్తుంది. మంచిది అయినా కాకున్నా నేటి కాలంలో వివాహ నిశ్చయ విషయంలో ఆధునిక పోకడలు ఎక్కువ ప్రభావిత పరుస్తున్నాయని నిస్సంకోచంగా చెప్పవచ్చు. వివాహాలు లౌకికంగా జరిగినా అలౌకిక లక్ష్యాలను, ప్రయోజనాలను నెరవేరుస్తున్నాయి అనేది శాస్త్రోక్తి! ధర్మశాస్త్ర విధివిధానంగా జరిగే వివాహాలు సమాజ హితాన్ని కలిగిస్తాయి. ఐహిక, ఆముష్మిక ప్రయోజనాలను కూరుస్తాయని పెద్దలు నిర్ధారించారు. వంశాన్ని పరంపరను ప్రసిద్ధం చేసే వివాహ బంధం పురుషార్థ సాధకంగా చెప్పబడిరది. అటువంటి వివాహ నిశ్చయం అనే ప్రక్రియ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేదై ఉన్నప్పుడే కుటుంబ, సమాజ హితం కలుగుతుంది అని పెద్దల మాట! అందుకే వధూవర వరణంలో కూడా అనగా వధూ వరులను ఒకరి కొకరిని ఎంచుకోవటం ఎంతో జాగరూకత వహించవలసి ఉంటుంది. వధూవరులు పరస్పరం సహజీవనంతో సంఘ సౌష్టవానికి దోహదం చేయాలి! దుస్సాంప్రదాయానికి దుఃఖానికి నెలవు కాకూడదు! .



వివాహ పరమార్థానికి ప్రతీకగా భగవత్ కల్యాణాలు కూడా జరిపిస్తారు. జగత్ కారణుడైన భగవంతునికి దయ స్వరూపిణి అయిన మహాలక్ష్మీదేవితో ఆగమోక్తంగా రామకృష్ణాది విభవ స్వరూప అర్చామూర్తులకు కళ్యాణం జరిపిస్తారు. తద్వారా అందరికీ శుభాలు కలుగుతాయని విశ్వసిస్తాము. అంతేకాదు ఈ కళ్యాణము జీవాత్మను పరమాత్మతో కలుపుట అని కూడా భావిస్తారు. శ్రీ వేదాంత దేశికుల వారు ఆ విశేషాన్ని ఈ విధంగా స్తుతిస్తారు.

"కర్మ జ్ఞానానురూప యవ్వన గతాం భక్త్యాఖ్య దూత్యాహృతాం
హృత్సంవేష్టిత మంత్ర మంగళ గుణాం జీవాత్మ కాంతాం హితాం" అనగా పరమాత్ముడనే వరుడు, కర్మ జ్ఞానము లనే అందమూ, యవ్వనమూ కలిగిన జీవాత్మ అనే కాంతను భక్తి అనే దూతికను పంపి తన చెంతకు చేర్చుకుంటాడు అని అభివర్ణిస్తారు. .

పురాణాల్లో ఇతిహాసాల్లో చెప్పబడిన మహా పురుషుల వివాహ విశేషాలు వధూ,వర వరణ ప్రాధాన్యం తెలియజేస్తాయి. ఆ వివాహ బంధం శాశ్వతమై, ఆనందదాయకమై నిలవాలి. స్వీయ హితమై, సమాజ శ్రేయమై పరిణమించాలంటే పెద్దలు కొన్ని నియమ సూక్తులను తెలిపారు.

"తుల్య శీల వయోవృత్తాం తుల్యాభి జన లక్షణాం
రాఘవోర్హతి వైదేహీం తమ్ చేయమసితేక్షణా"

అని శ్రీ రామాయణం లో సీతారామచంద్రుల జంటను గురించి చెప్పబడిరది. సమానమైన గుణశీలములు, వయస్సు, నడవడి, అభిజనము, లక్షణము అను ఐదు లక్షణాలు గల స్త్రీ పురుషుల జంట లోకోత్తరం అవుతుందనేది పెద్దల అభిప్రాయం. సమానంగా అంటే సరితూగే విధంగా యోగ్యంగా ఉండటం. వయస్సు విషయంలో సహజ దేహ గుణ స్వభావముల ననుసరించి వధూవరులలో పురుషులు కొంచెం ఎక్కువ వయసు కలిగి ఉండునట్లుగా పెద్దలు నిర్ధారించారు. "యో మే భర్తా స మే గురుః" సీతాదేవి అన్నట్లు భర్తను గురువుగా, గౌరవనీయునిగా, భార్యను తోడుగా ఆదరణీయగా పరస్పర అనురాగ పూరితంగా వివాహబంధం కొనసాగాలి. అందుకు అనువైన విధంగా వధూవర వరణం ఉండ తగినది. అని వైదిక ధర్మం చెబుతుంది. కానీ ఆ పరస్పర గౌరవం ఆదరణలు అధికారంగా, అంకుశంగా మారి అనుబంధాలు అంతరించ కూడదు అనేది మేథావుల విశ్లేషణ! వివాహ నిశ్చయం వధూ,వర వరణం గురించి మరింతగా భక్తి బంధురమైన చరిత్ర లోతుల్లోకి వెళితే. తడిగొండ వెంగమాంబ, బీబీ నాచ్చియార్, గోదాదేవి వంటివారు భగవంతుణ్ణే భర్తగా వరించారు. **(మిగతా 10 వ పేజీలో)**



# ఆధ్యాత్మికత అంటే ...

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

మానవ జీవితము ఆధ్యాత్మిక మార్గంలో మాత్రమే ధన్యమగును. అసలు ఎన్నో ప్రాణులలో ఈ మానవ జన్మ కలుగుట కేవలము ఆధ్యాత్మిక సాధన ద్వారా జన్మరాహిత్య స్థితిని సాధించడం కోసమే ఏర్పడినది. ఎన్నో జన్మలు అనేకములైన ప్రాణులుగా పుట్టి గిట్టి చిట్టచివరికి ఈ ఉత్తమమైన మానవజన్మ ఏర్పడుతుంది. ఇది ఎన్నో జన్మల పుణ్యఫలముగా ఏర్పడినదే కానీ వృథాగా ఈ జన్మను ఐహిక సౌఖ్యాల ద్వారా పాడు చేసుకోవడానికి కాదు. కావున మానవజన్మ భగవంతుడు మనకు ఉన్నతమైన శాశ్వతానందమును సాధించడానికి ఇచ్చినదిగా గుర్తించి ఆధ్యాత్మిక సాధనల ద్వారా సార్థకం చేసుకోవాలి.

ఆధ్యాత్మిక సాధనకు ప్రత్యేకించి మనము చేయవలసిన ప్రయత్నములేవి ఉండవు. అయితే మనకు భగవంతునికి గల సంబంధ జ్ఞానమును గుర్తిస్తే చాలు. అంటే భగవంతుడు ఉన్నాడని ఈ సృష్టి అంతా ఆయన వల్ల ఏర్పడిందని ఆ సృష్టి అంతులేనిదనీ, అందులో తాను ఒకడినని, తాను ఆయనకు లోబడిన వాడిననీ ఆయన ఈ లోకాలను సృష్టించి ఏర్పరిచిన నియమాలకు లోబడి నడుచుకోవాలని, అలా నడుచుకోకపోతే కలిగే ఇబ్బందులకు తానే బాధ్యుడనని, ఆ భగవంతుడు ఏర్పరిచిన నియమాలను తాను చక్కగా నిర్వర్తించే విధముగా భగవంతుడు తనను ప్రేరేపించాలని కోరడమే మనము చేయవలసినది. ఇలా మనం చేసే సాధన స్వార్థపూరితమైనది కాదు. ఇహలోక సౌఖ్యాలను వాంఛించి చేయడము కాదు "ఓ భగవంతుడా! నాకు చదువు నివ్వు, సంపదనివ్వు, సౌఖ్యాలనివ్వు, అధికారములివ్వు, అని కోరడమంతకంటే కాదు! ఎందుకంటే భగవంతునికి మనకు గల సంబంధ జ్ఞానమును గుర్తించడంలో దేబిరించే వ్యక్తిత్వము లేదు. మనకు భగవంతుడిచ్చిన బాధ్యతను ఆయనేర్పరచిన నియమములకు లోబడి నిర్వర్తించడమే మన పని. అలా నిర్వర్తించేలా చేయమని ఆయనను కోరడమే మనం చేయవలసినది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దేవుడు లేడనే నాస్తికుడికి దేవుడున్నాడనే ఆస్తికుడికి తాము చేసే పనిలో ఏ వ్యత్యాసము ఉండదు కేవలం మానసికమైన ఆలోచనలో మాత్రమే వ్యత్యాసం ఉంటుంది.

దేవుని విశ్వసించని వాడు తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాడు. తను చేసే పనికి తానే బాధ్యుడినని గుర్తిస్తాడు. చేసిన పని వల్ల వచ్చే ఫలితాలు అనుకూలమైనా, ప్రతికూలమైనా తానే అనుభవిస్తాడు. అలాగే దేవుని విశ్వసించే వాడు కూడా ఉండాలి. కానీ లోకంలో అలా మనం చూడలేం! దేవుని నమ్మేవాడు తను చేసే పనులన్నింటికీ అనుకూలమైన ఫలితాలే రావాలని కోరుకుంటూ దేవుణ్ణి ప్రార్థిస్తూ మొదలుపెడతాడు. ఒకవేళ తనకు ప్రతికూలమైన ఫలితం వస్తే దేవుడు తన్ను కనికరించలేదని నిందించడానికి కూడా వెనుకాడడు. అంతేకాదు తనకు ప్రతికూలమైన ఫలితాలు రావటానికి కారణమైన వారిపై ద్వేషాన్ని శత్రుత్వాన్ని కూడా పెంచుకొని వారిపై పగ తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాడు. అయితే ఇటువంటి పనులు దేవుని నమ్మని వారు కూడా చేస్తారు కదా! అంటే నిజమే దేవుని నమ్మని వాడు ఎప్పుడు ఇహలోకాన్ని ఇక్కడి సౌఖ్యాలను మాత్రమే కోరతాడు. కాబట్టి అతనికి ఇది సహజమే! కానీ దేవుని నమ్మేవాడు పారలౌకికమైన వాటిని కూడా విశ్వసిస్తాడు. కావున దేవుని నమ్మని వాని కంటే విభిన్నంగా ఉండవలసి ఉంది. కానీ అలా ఉండకపోగా మరింత అజ్ఞానంతో దేవున్ని కూడా నిందించే స్థాయికి దిగజారుతాడు. అలా కాకుండా ఉండడానికే మనకి భగవంతునికి గల సంబంధం తెలుసుకోవాలి!

ఎప్పుడైతే అలాంటి జ్ఞానం దేవుని విశ్వసించే వాడికి కలిగిందో అప్పుడే అతడు నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు. అప్పుడే అతడు దేవునితో వ్యాపారం చేయడు. అప్పుడే అతడు తనకు నష్టం వచ్చినా దేవుడిని దూషించడు! లాభం వచ్చినా ఉబ్బి తబ్బిబ్బవడు! ఒకే రకంగా ఉంటాడు. జీవించి ఉన్నంతవరకు తనకు భగవంతుడిచ్చిన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ కర్తవ్య నిర్వహణలో కష్టాలను కూడా ధైర్యంగా ఎదుర్కొని లక్ష్యాన్ని సాధిస్తాడు. మానవ జీవితం అలా మలుచుకోవటానికే ఏర్పడింది. పిరికితనంతో సమస్యల నుండి పారిపోవడానికి కాదు. ప్రతిదానికి దేవుని ప్రార్థిస్తూ లేనిపోని కోరికలు కోరుతూ ఊహల్లో విహరిస్తూ భగవంతుడు ప్రసాదించిన విలువైన కాలాన్ని వ్యర్థం చేసుకోవడానికి కాదు. కావున భగవంతుని యందు విశ్వాసం కేవలం మనం చేయవలసిన పనిలో ప్రేరణ పొందటానికి మాత్రమే! అలాగే సమస్యలను ఎదుర్కోవటంలో ధైర్యాన్ని పొందడానికి మాత్రమే! అసలు సమస్యలే వద్దని కోరటానికి కాదు. ★

# శ్రీపతి స్తుతి


## సుభాషితం
### మంచి మాట

**శ్రియై నమః! శ్రీధరాయ నమః!**

**హార్యష్టకం** రెండవశ్లోకము

**(గత సంచిక తరువాయి)**

సః సేతుః -సేతు అనేది హిందూ మహాసముద్రంలో భారత దేశం నుండి శ్రీ లంక వరకు త్రేతాయుగంలో శ్రీరామ చంద్రుడు వానర సేనతో నలుని నేతృత్వం లో నిర్మించాడు. కాబట్టి పవిత్రమైనది. అనేక పాపాలను తొలగించేది బ్రహ్మ హత్యాది మహా పాపాలు కూడా పోతాయి. నేడు సైంటిస్టులు ఆ సేతువును దర్శింప చేస్తున్నారు. సః కాశీ. అతడే కాశీ క్షేత్రం. కాశీ క్షేత్రంలో కాల భైరవుడుంటాడు. ముక్తిదాయక మయిన ఏడు క్షేత్రాలలో 4 వది కాశీ క్షేత్రం. “అయోధ్యా మధురామాయా కాశీ కాంచీ హ్యవంతికా పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్ష దాయకాః” అని కీర్తింప బడుతుంది. అక్కడ గంగా నది ప్రవహిస్తుంటుంది సాక్షాత్తు పరమశివుని నివాసము. “కాశ్యాంతు మరణాన్ముక్తిః” కాశీలో మరణించిన వానికి ముక్తి లభిస్తుంది. కాశీలో మహా శివుడు మరణించే వారి చెవిలో రామ నామాన్ని వినిపిస్తాడని ప్రతీతి. శివుడు కాశీవిశ్వేశ్వరుడనే పేరుతో ప్రసిద్ధుడు. అక్కడ పార్వతీ దేవి కూడా కాశీ విశాలాక్షి” అని పిలువ బడుతుంది. ప్రసిద్ధమైన పార్వతీ దేవి క్షేత్రాలు మూడు.



శ్రీమాన్ అమరవాది వేంకటనరసింహా చార్యులు

కంచిలో కామాక్షి, మధురలో మీనాక్షి, కాశీలో విశాలాక్షి. ఇవన్నీ శ్రీ మహాలక్ష్మి రూపాంతరాలే! మనం లక్ష్మి స్తోత్రంలో “నవదుర్గాం మహాకాళీం బ్రహ్మ విష్ణు శివాత్మికాం” అంటాం కదా! అట్టి విశాలాక్షీ. సమేతుడయిన విశ్వేశ్వరుని అభిమాన క్షేత్రం కాశీ ఇక్కడ తీర్థం, క్షేత్రం రెండూ ముక్తిదాలే! పితృ ముక్తి ప్రదం. మనం శ్రాద్ధ సమయంలో పిండ ప్రదానం చేస్తూ కాశీలోన గయలోన వట వృక్షం క్రింద ఆమ దానం చేస్తే లభించే ఫలితం ప్రసాదించుమని ప్రార్థిస్తూ ఉంటాము. అక్కడ గంగలో స్నానం చేసి దేవతాదర్శనం చేసుకొని గోదానాది పుణ్య కార్యాలు చేస్తే అధిక ఫలం లభించును.

**మరికొన్ని మంచి విషయాలు వచ్చే సంచికలో...**

# భక్తి భావ ప్రీతి -దివ్య ప్రబంధ ఖ్యాతి

**(6 వ పేజీ తరువాయి)**

భగవద్రామానుజాచార్యుల సంస్కరణలలో ప్రధానమైనది దేవాలయ వ్యవస్థ. ఆళ్వార్ల భక్తి ప్రబంధాలలోనూ వివిధ దివ్యదేశ అర్చామూర్తులు స్తుతించబడ్డారు. జగదాచార్యులు దివ్యదేశ విజయ యాత్రలు చేస్తూ ఒకసారి ఆళ్వారు తిరునగరికి వచ్చారట! శ్రీనమ్మాళ్వార్లను, ఆదినాథ పెరుమాళ్లను సేవించి, తామ్రపర్ణి నది దాటి నవ తిరుపతులలో “తిరుప్పుళింగుడి” కి బయలుదేరారు. మార్గ మధ్యలో వారికి ఒక బాలిక కనిపించింది. యతిరాజులు ఆమెను “తిరుప్పుళింగుడి” దారి ఎటువైపు? అని అడిగారు. ఆమె యతిరాజులను చూచి మీకు తిరువాయిమొళి వచ్చా? రాదా? అని ప్రశ్నించిందట! ఆశ్చర్యపోయిన యతిరాజులు ఎందుకని అడగగా ఆ బాలిక “కూవుదళే మేళి” అను (9వ 10 లో రెండవ తిరువాయిమొళి పదవ) పాశురం చదివి ఆళ్వార్ తిరునగరికి కూత వేటు దూరంలోనే ఉంటుంది.అని సమాధానం ఇచ్చిందట! యతిరాజులు ఆ బాలికను చూసి ఎంతో సంతోషించారు. శ్రీ నమ్మాళ్వార్లపై ప్రీతితో తన శిష్యులలో ఒకరికి తిరుక్కురుగై పిరాన్ పిళ్ళాన్ అనే పేరు ఉంచి వారిని పుత్రులుగా చూసుకునేవారు. వారికి, తిరువాయి మొళిని స్వయంగా ఆకళించుకున్న ఆ బాలికతో తల్లిదండ్రుల అనుమతితో వివాహం జరిపించారు.

భగవద్రామానుజాచార్యులు దివ్య ద్రావిడ ప్రబంధ భక్తి భావామృతంలో ఓల లాడారు. ఉభయ వేదాంత ప్రవర్తకులై దివ్య ప్రబంధ ఖ్యాతినీ ప్రాచుర్యం చేశారు.

# శ్రీవైష్ణవ కళ్యాణ వేదిక

ఇల్లుకట్టి చూడు పెండ్లి చేసిచూడు అని మన పెద్దలు చెప్పేవారు. ఈ రెండు విషయాలలోకి దిగితే ఎంతో అనుభవం వస్తుందని నమ్మకం. ముఖ్యంగా పెండ్లి సంబంధం కుదుర్చాలంటే ఎన్నో సంగతులు. కొన్ని సమస్యలు జ్యోతిషపరంగా ఎదురైతే, మరికొన్ని కుటుంబపరంగా చవి చూడాల్సి వస్తుంది. అలాంటిది నలుగురికి పెండ్లి సంబంధాలు కుదర్చడం సామాన్య విషయమేమీ కాదు.

శ్రీవైష్ణవ కుటుంబాలలో వధూ, వరుల వివరాలు ఒకే వేదికపై అందరికి అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో శ్రీమాన్ కందాళై



రమణాచార్య, శోభ గారు శ్రీవైష్ణవ కళ్యాణ వేదికను 2019 ఏప్రిల్ 20న ప్రారంభించారు. కేవలం నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే సుమారు మూడువందలకుపైగా కుటుంబాలను సమన్వయం చేయగలిగారు.

నలుగురికి ఉచితంగా సేవచేయాలన్న లక్ష్యంతో శ్రీమాన్ కందాళై రమణాచార్య ప్రారంభించినదే శ్రీ వైష్ణవ కళ్యాణ వేదిక. ఇలాంటి ప్రయత్నాన్ని ఎందరో చేస్తున్నారు చేశారు. కానీ ఉచితంగా సేవ చేసేవారు అరుదు. వీరు కుటుంబాలను సమన్వయం చేస్తున్న విధానంలో వైవిధ్యం ఉంది. అందరినీ చిరునవ్వుతో పలకరించడం వీరి అలవాటు. తపాలా శాఖలో పదవీ విరమణ తరువాత శ్రీ వైష్ణవ కళ్యాణ వేదిక ఏర్పాటు చేయాలన్న ఆలోచన వారికి వచ్చింది. దీనికి కుటుంబ సభ్యులు సహకరించారు. పరమహంస పరివ్రాజకాచార్య, శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి మంగళాశాసనాలు లభించాయి. సుమారు 300 పై చిలుకు, శ్రీవైష్ణవ చిరంజీవులు, గృహస్థాశ్రమంలో అడుగుపెట్టడం స్వామి వారి అనుగ్రహమే అని వీరు భావిస్తారు.

## సంక్రాంతి సంబరాల పుష్య మాస శోభ

**(4వ పేజీ తరువాయి)** ప్రధానంగా నేటికి ప్రపంచవ్యాప్తంగా హిందువులు అయ్యప్ప స్వామి పూజలు జరుపుతున్నారు. పళనిలో కూడా సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఈరోజు దానం చేస్తే అగ్నిష్టోమ ఫలం కలుగుతుందని భవిష్యత్ పురాణంలో చెప్పబడిందని పెద్దల మాట! మహా పౌషీ దినమున నదీ స్నానం శ్రేష్ఠం. దీనిని హిమశోధన పూర్ణిమ అని కూడా అంటారు. కృష్ణపక్షమందలి తిథులు పాడ్యమి విద్యావ్యాప్తి వ్రతం, అష్టమి, కాలాష్టమి ఏకాదశి షట్‌తిలైకాదశి ద్వాదశి మహా ఫలద్వాదశి అమావాస్య బకులామవాస్య చొల్లంగి అమావాస్య జరుపుకుంటారు. పుష్య బహుళ అమావాస్య నాడు సప్త సాగర యాత్ర ప్రారంభించే ప్రదేశం చొల్లంగి. ఈ నామం తో చొల్లంగి అమావాస్య నాడు గోదావరి నదీ స్నానం శ్రేష్ఠం.పుష్యమి నక్షత్రం ప్రకాశవంత మైనది. సవితృమండల మధ్య వర్తి అయిన భగవంతుని ఆరాధించుటకు. కావలసిన పుష్టిని, పోషణను పుష్య మాసం కలిగిస్తుంది. ఆపుష్యమాస శోభలో సంక్రాంతి సంబరాలను అందరం జరుపుకోవాలి.

## వివాహ నిశ్చయం

**(7వ పేజీ తరువాయి)** వివాహ నిశ్చయంలో పెద్దల ఆచారము, సంస్కృతి, సాంప్రదాయము, వధూవర పరస్పరవరణము మూడు ప్రధానమైనవే అందుకే పెద్దలు "కన్యా వరయతే రూపం మాతా విత్తం పితా శ్రుతం బాంధవాః కులమిచ్ఛంతి మృష్టాన్న మితరే జనాః" అని చెప్తారు అనగా కన్య వారి రూపాన్ని చూసి వరిస్తుంది. తల్లి తన కూతురుకు ఆర్థిక కష్టాలు కలగకూడదని ధనం చూస్తోందట! తండ్రి విద్యా యోగ్యతను, బంధువులు కులాన్ని, గొప్పతనాన్ని, వివాహానికి వచ్చిన ఇతర జనులు విందును చూస్తారు అని భావం.

రక్త సంబంధం ఎంత గొప్పదైనా వైదిక మంత్ర క్రియ ద్వారా ఏర్పడే వివాహ బంధం ఎంతో గొప్పది. పవిత్రమైనది పారమార్థిక లక్ష్యాన్ని నిర్దేశిస్తూ వైదిక ధర్మం ఏర్పరిచిన వివాహ సంబంధ విషయాలు, నియమాలు ఎంతో శ్రేష్ఠమైనవి. వివాహ సంబంధం వ్యక్తిగత ఆనందం కోసమే కాకుండా సమాజహితంగా సంస్కృతి విహితంగా ఏర్పడాలి. పరిణయాలు శుభ జీవన గమనాలై. పరిణమిల్లాలి.

# "శ్రీ సన్నిధానం"కు మంగళాశాసనాలు

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



**జై శ్రీమన్నారాయణ**

దివ్యమైనటువంటి శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామివారి యొక్క అపురూపమైన మంగళాశాసనాలతో జగిత్యాల జిల్లా ప్రాంతంలో మెట్టుపల్లి పక్కన ఉన్న గోధూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి యొక్క సన్నిధానంలో భగవంతుని ఆరాధన చేస్తున్నటువంటి శ్రీ ఉ.వే. శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్య స్వామి వారు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు అయిన పెద్దలందరూ కూడా కలిసి 1990 సంవత్సరంలో శ్రీ సన్నిధానం అనేటువంటి ఒక మాస పత్రిక ను చేయాలని కోరికతో ఆరంభించారు. కొంతకాలంగా అది సాగి ఇతరములైన విషయాలతో అది కాలయాపన జరిగింది. అది నేడు డిజిటల్ పత్రికగా సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని పాఠకుల ఆదరణ చూరగొంటున్నది. పున: ప్రారంభమైన సంవత్సరంలోనే పాఠకుల ఆదరణ క్రమంగా పెరుగుతోంది. శ్రీసన్నిధానం ట్రస్ట్‌గా సేవాకార్యక్రమాలకు నడుంబిగించింది. ఈ సంచికను పండితులు, విద్యావంతులు, పౌరాణికులు ఇతరమైన జ్ఞానం కలిగిన మహనీయులు అందరూ కూడా వారి వారి విజ్ఞానాన్ని పత్రికకు అందించవలసినదిగా ప్రార్థిస్తూ శ్రీ.శ్రీనివాసుని కృపాకటాక్షాలతో దినదిన ప్రవర్థమానం కావాలని మంగళాశాసనాలు అందిస్తున్నాము.

ఇందులో ఉండేటువంటి వేదాంత విషయాలు కానీ పౌరాణిక విషయాలు కానీ, విజ్ఞాన విషయాలు కానీ, ఇతరత్రా విషయాలు ఎన్నో శీర్షికలను ఈ దివ్యమైన పత్రికలో చేర్చడం జరుగుతుంది. సమస్త జనావళికి కూడా ఉపయోగకరం కనుక చదువరులందరూ చదివి దీనిలో వుండే సారాంశాన్ని గ్రహించి జీవితాన్ని బాగా చేసుకుని ప్రశాంతంగా జీవింతురు గాక ! అని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ★

# ఇదిగో !! సరికొత్త శీర్షిక ...

జ్యోతిష్య పరిజ్ఞానాన్ని పాఠకులకు అందించే ప్రయత్నానికి శ్రీసన్నిధానం శ్రీకారం చుట్టింది. శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు, ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితులు, ప్రసిద్ధులు శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక గారు త్వరలో శ్రీసన్నిధానం పత్రిక ద్వారా అందరికీ ఆసక్తిని కలిగించి, జిజ్ఞాసను తీర్చే విధంగా జ్యోతిష్య సంబంధ విశేషాలను అందించనున్నారు. పాఠకుల సందేహాలు, సమాధానాలు ధారావాహికంగా అందివ్వడానికి ముందుకు వచ్చారు. జ్యోతిష్య శాస్త్ర రహస్యాలను పాఠకులకు అందించే ప్రయత్నం ఇది.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!! మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

**మీ సందేహాలను శ్రీసన్నిధానం వెబ్‌సైట్ ద్వారా కానీ, ఫేస్ బుక్ ద్వారా కూడా పంపించవచ్చు**

**సందేహ ప్రశ్నలను పంపాల్సి వాట్స్ ఆప్ నెం 9502583323**

-మేనేజింగ్ ఎడిటర్






# హైదరాబాద్‌లో 49వ శ్రీమద్భాగవతసప్తాహ జ్ఞాన యజ్ఞము

## ఆధ్యాత్మిక వార్తలు

హైదరాబాద్ అంబర్‌పేటలో డిసెంబర్ 24 నుంచి 30 వరకు శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞము వైభవంగా జరిగింది. పరమ భాగవతోత్తములు జ్యోతిష, వాస్తు శాస్త్ర పండితులు భాగవత సప్తాహ ప్రవచనా దురంధరులు శ్రీమాన్ శ్రీ నంబి. వేణుగోపాలా చార్య కౌశిక గారు భాగవతసప్తాహ ప్రవచనాన్ని అనుగ్రహించారు. వారి ప్రవచనామృతాన్ని గ్రోలేందుకు మహారాణాప్రతాప్ ఫంక్షన్ హాల్‌కు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీసన్నిధానం వారితో ముచ్చటించింది. “సదా పురాణాలు సప్తాహలు కాలక్షేపాలు అనుగ్రహించే మహానుభావులు, జగిత్యాల వాస్తవ్యులు అయిన చంద్రమౌళి శాస్త్రి గారి కోరిక మేరకు పురాణం చెప్పాను. పండిత పరిపూర్ణులు, మహానుభావులు అయిన వారు, నీవు పురాణం చెప్పాలని కోరారని, వారి వాక్కు బలంతో, మా అమ్మగారి ఆజ్ఞ తో భగవదనుగ్రహంతో భక్తుల కోరికపై 49వ భాగవత సప్తాహం నిర్వహిస్తున్నాను.” అని శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపలాచార్య కౌశిక గారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ పురాణ ప్రవచన పండితులు కీ.శే శ్రీ సరాబు మందిరం చంద్రమౌళి శాస్త్రి గారిని స్మరించుకున్నారు. వారు తన జీవన గమనంలో జరిగిన మధుర స్మృతులను శ్రీసన్నిధానతో పంచుకున్నారు.








## భగవద్గీత పుస్తకాల వితరణ

యాదాద్రి జిల్లా రఘునాథపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ రామకోటి భగవద్గీత గ్రంథాలయం రామకోటి రాసే భక్తులకు భగవద్గీత చదివే భక్తులకు శ్రీమన్నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బల్ల గణేష్, ఓనగంటి శ్రీధర్, భోగా లక్ష్మీనారాయణ, చిప్ప సుదర్శన్, వల్లకాటి బాబురావు, లోక పాండు, రేగొండ వెంకటేష్, బల్లయాదేశ పాల్గొన్నారు.